సాక్షి అనకాపల్లి

ఆదివారం । 9 । జూన్ । 2024



విద్యార్థుల బీచ్ క్లీనింగ్

విశాఖ: ఏయూ విద్యార్థులు రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌ను శుభ్రం చేశారు.



సహస్ర తులసీదళార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.3/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

మోదకొండమ్మ తల్లి పండగకు ఏర్పాట్లు



మాడుగుల: ఈ నెల 18వ తేదీన ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు అద్దుతున్నారు. అమ్మవారి విగ్రహాన్ని కూడా రంగులు, నగలతో అలంకరిస్తున్నారు. భారీ విద్యుత్ లైటింగ్, సెట్టింగ్‌లతో ఆలయం నుంచి సతకంపట్టు వరకు కళకళలాడుతోంది. పాత బస్టాండ్‌లో విద్యుత్ దీపాలంకరణతో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడానికి సెట్టింగ్‌లు నిర్మిస్తున్నారు. అమ్మవారిని సులువుగా దర్శించుకోవడానికి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీటితో పాటు ఇతర సదుపాయాలను ఆలయ కమిటీ కల్పిస్తోంది. పండగను ప్రశాంతంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది.

అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త జోగులు
- పార్టీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం: ఇటీవల మృతి చెందిన వెంకటాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని వాడపర్తి రమణ కుటుంబాన్ని పార్టీ పాయకరావుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం పరామర్శించారు. పార్టీ ఓటమి అందరినీ బాధించిందని, కార్యకర్తలు కాస్త ఓపిక పట్టాలని చెప్పారు. ఏ సమస్య వచ్చినా కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొప్పిశెట్టి సత్యం, కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, పార్టీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు, పోచిన నరేష్, మరిశా రమణమూర్తి తదితరులు ఉన్నారు.

టికెట్ చెకింగ్ సిబ్బందికి బాడీఓర్న్ కెమెరాలు



బాడీఓర్న్ కెమెరాలు అందుకున్న కమర్షియల్ సిబ్బందితో డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో గల టికెట్ చెకింగ్ సిబ్బందికి బాడీఓర్న్ కెమెరాలు అందజేశారు. పారదర్శకంగా విధుల నిర్వర్తించేందుకు గాను ఈ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. వాల్తేర్ డివిజన్‌లో గల కమర్షియల్ సిబ్బందికి ఈ కెమెరాలను డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో జరిగే వివిధ కార్యకలాపాలను కూడా ఈ కెమెరాలలో బంధించడం జరుగుతుంది. ప్రయాణికుల భద్రత, టికెట్ తనిఖీ సిబ్బంది ఎటువంటి అవినీతి అక్రమాలకు అవకాశం లేకుండా, వేగవంతంగా సేవలందించేందుకు ఈ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. త్వరలోనే వీటిని మరింత మంది సిబ్బందికి అందజేయనున్నట్లు డీఆర్ఎం తెలిపారు.

వెబ్ ఆప్షన్ల నమోదు మొదలు

మురళీనగర్ (విశాఖ) : పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా శనివారం వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నుంచే వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. సాంకేతికత సమస్య వల్ల సాయంత్రం వెబ్‌సైట్ తెరుచుకోలేదు. శనివారం ఉదయానికి సైట్ పనిచేయడంతో ఎక్కువ మంది విద్యార్థులు వారి ర్యాంకుల ప్రకారం తమకు నచ్చిన కాలేజీల్లో కోర్సులను ఎంపిక చేసుకున్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల, గైస్, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చారు. వీరికి సిబ్బంది సహకరించి, వారి ఎంపిక చేసిన కాలేజీలకు ఆప్షన్లు పెట్టారు. ఈ నెల 6తో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువు ముగిసినప్పటికీ.. కొత్తవారి సర్టిఫికెట్లను శనివారం కూడా పరిశీలించారు.

కాటేసే కాలం..

- ఖరీఫ్‌లో విష సర్పాలతో జాగ్రత్త
- వానాకాలంలో పంట పొలాల్లో ఎక్కువగా పాముల సంచారం
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు



సాక్షి, అనకాపల్లి:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానాకాలం ప్రారంభంలో విషసర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈనెల నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గతేడాది జిల్లాలో 1000 మంది రైతులకు పైగా పాముకాటుకు గురయ్యారు. వీరిలో 15 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పొలాల గట్ల మీద వెళ్లేటపుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకువెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు తిరుగుతాయి. తడిగా ఉంటే కప్పలు.. వాటిని తినడానికి పాములు చేరతాయి. అలాగే తేళ్లు వంటి ప్రమాదకర ప్రాణులు తిరుగాడే ఆస్కారముంది. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరతాయి. చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

పాము కాటు లక్షణాలు

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండెపోటుకు గురయ్యే ప్రమాదముందని పేర్కొంటున్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టు వేయాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి, నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్టు గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్లపాములే ప్రమాదకరమైన సర్పజాతులు. వాటితోనే ఎక్కువ ప్రమాదముంటుంది. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం ప్రమాదం లేని మాములు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలామంది షాక్‌తోనే ప్రాణం మీదకి తెచ్చుకుంటారు. ఇంట్లోవారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడిస్తే బాధితుడు భయాందోళనకు గురై పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.

ఇలా చేయకూడదు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాముకాటు కన్నా ఈ ఆ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

పాములు–విషప్రభావం

కట్ల పాము: ఇది కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి

నాగుపాము: ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.

రక్తపింజర: ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.

జెర్రిపోతు, నీరుకట్టు: ఇవి కాటేసినా విషం ఉండదు. అయితే ఆస్పత్రిలో చికిత్స అవసరం.

అందుబాటులో యాంటీ వీనమ్ ఇంజక్షన్లు



జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో సీహెచ్‌సీలో సగటున 20 ఇంజక్షన్లు, ఏరియా, డిస్ట్రిక్ట్ ఆస్పత్రిలో 30 వరకు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. కరిచిన వెంటనే ముందుగా గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకోవాలి. గాయాన్ని బట్టి రెండుసార్లు స్నేక్ వీనమ్ డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు.

– శ్రీనివాస్, ఆస్పత్రి సర్వీసుల జిల్లా సమన్వయకర్త–డీసీహెచ్‌ఎస్

ఏయూపై అసత్య ప్రచారాలు వద్దు

రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంపై అసత్య ప్రచారాలు చేయడం, అసత్య కథనాలు ప్రచురించడం మానుకోవాలని రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఏయూలో కీలక దస్త్రాలు మాయమయ్యాయంటూ ఓ పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఖండించారు. ఐదేళ్లుగా ఏయూకు సంబంధించిన ఫైళ్లను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్సిటీ ఉపకులపతి తన వద్ద ఎటువంటి ఫైళ్లను ఉంచుకోలేదని స్పష్టం చేశారు. వీటిని వర్సిటీలో డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయిలో ఉండే ఉపకులపతి సెక్రటరీ పరిశీలన చేసి పరిరక్షిస్తున్నారని తెలిపారు. ప్రతీ సెక్షన్ నుంచి వచ్చిన ఫైళ్లను పరిశీలించి, తిరిగి క్రమపద్ధతిలో అదే సెక్షన్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఇదే విధంగా రిజిస్ట్రార్ కార్యాలయంలో సైతం ఫైళ్ల నిర్వహణ ఉంటుందన్నారు. ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లు భాగం చేస్తూ ఫైళ్లు మాయమయ్యాయంటూ కథనాలు ప్రచురించడం సమంజసం కాదన్నారు. ఇటువంటి కథనాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, వందేళ్ల చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఏయూపై దురుద్దేశపూర్వకంగా ఇటువంటి కథనాలు ప్రచురిస్తున్నారనే సందేహం కలుగుతుందన్నారు.

వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఏయూలో ప్రతీ ఫైల్ ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తూ సంబంధిత సెక్షన్లలో భద్రంగా ఉన్నాయని స్పష్టం చేస్తున్నానన్నారు. ప్రజలు ఇటువంటి అసత్య కథనాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

పాములను రక్షించండి





పాముల గురించి అవగాహన కల్పిస్తున్న స్నేక్ క్యాచర్ కిరణ్ కుమార్

కంచరపాలెం (విశాఖ): పాములను చూసి భయాందోళన చెందవద్దని స్నేక్ సేవ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ సూచించారు. కంచరపాలెంలోని రామ్మూర్తిపంతులుపేట మహాత్మాగాంధీ గ్రంథాలయ మైదానం ఆవరణలో శనివారం ×పాము జాతులు–పాములతో భయాందోళన×పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని పాములు విషపూరితం కాదన్నారు. పాము కాటు వేస్తే భయపడకుండా.. ప్రథమ చికిత్స చేసి సమీప ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పాముల సంచారం ఎక్కువైందని, అందుకోసం ఈ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పాములు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, పాములు చంపితే వాటి జాతి అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా నాగుపాము, నల్లత్రాచు, కొండచిలువ, జెర్రిగొడ్డు, కోబ్రా, సాండ్‌బో(రెండు తలల పాము) తదితర పాములను చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. పాములు కనిపిస్తే 98491 40500కు ఫోన్ చేయాలని సూచించారు. బృందం సభ్యులు మోహన్ జగన్, రమేష్, సురేష్, గ్రీతీష్, రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్లర్క్ నుంచి లెఫ్టినెంట్ స్థాయికి..

- పట్టుదలతో పైకి ఎదిగిన పల్లెటూరి యువకుడు



శిక్షణ పూర్తి చేసుకొని, లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న విజనగిరి గోవింద్

నర్సీపట్నం: సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడా యువకుడు. ఆర్మీలో ఉద్యోగం వచ్చిందని సంతృప్తి చెందలేదు. అందులోనే ఉన్నత స్థానానికి వెళ్లాలని నిరంతరం కష్టపడ్డాడు. పోటీ పరీక్షలు రాసి అనుకున్నది సాధించాడు. యువతరానికి ఆదర్శంగా నిలిచాడు. రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం పంచాయతీ శివారు గంపవానిపాలేనికి చెందిన విజనగిరి గోవింద్ విజయప్రస్థానమిది. గోవింద్ పుట్టింది పల్లెటూరు అయినప్పటికీ తల్లిదండ్రులు రాజారావు, సత్యవతి ప్రోత్సాహంతో చదువుపై దృష్టి సారించారు. ప్రాథమిక విద్య గంపవానిపాలెం ప్రభుత్వ పాఠశాల, కొత్తకోట జూనియర్ కాలేజీలో ఇంటర్, బీకాం డిగ్రీ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. 2011లో కాకినాడలో నిర్వహించిన ఓపెన్ సెలక్షన్ ర్యాలీలో క్లర్క్‌గా సెలెక్ట్ అయ్యారు. భోపాల్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్ సెంటర్‌లో ఏడాదిన్నర శిక్షణ పూర్తి చేసుకుని, అహ్మదాబాద్‌లో విధుల్లో చేరారు. 13 ఏళ్లుగా ఆర్మీలో సేవలు అందిస్తున్నారు. 2023 మార్చిలో ఎస్ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డు) బెంగళూరులో ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూలో 152 మంది పోటీ పడగా 8 మంది ఎంపికయ్యారు. ఈ ఎనిమిది మందిలో గోవింద్ ఒకరు. ఆఫీసర్స్ విభాగం క్లాస్‌వన్‌లో స్పెషల్ కమిషన్ ఆఫీసర్ (లెఫ్టినెంట్)గా ఎంపికయ్యారు. బిహార్ రాష్ట్రం గయాలో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ అనంతరం తల్లిదండ్రులు, భార్య భవాని, పిల్లలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఇండియన్ ఆర్మీలో స్పెషల్ కమిషన్ ఆఫీసర్‌గా రాజస్థాన్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు.

మోదమ్మ జాతర చూసొద్దాం



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ తల్లి



విద్యుత్ దీపాలంకరణలో మోదకొండమ్మ తల్లి ఆలయం



అమ్మవారి ఉత్సవ జెండాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- నేటి నుంచి మూడు రోజులు అమ్మవారి జాతర
- ముస్తాబైన పాడేరు పట్టణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తజనం

సాక్షి,పాడేరు: తెలుగు రాష్ట్రాల్లో భక్తుల నీరాజనం అందుకుంటున్న పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం నుంచి ఈనెల 11వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ, అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. దీనిలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి మూలవిరాట్‌కు రంగులు వేయించారు. విగ్రహాన్ని బంగారు ఆభరణాలు, పూలదండలతో అలంకరించారు. అలాగే మెయిన్ రోడ్డులోని సతకంపట్టు వద్ద ప్రత్యేక మండపాన్ని నిర్మించారు. ఉత్సవాలు ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమవుతాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఇత్తడి ఘటాలను పాడేరు పురవీధుల్లో ఊరేగించి, మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద ప్రతిష్ఠించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. కలెక్టర్ విజయసునీత,జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, పాడేరు ఇన్‌చార్జి ఏఎస్పీ (అడ్మిన్)శివకిషోర్, పాడేరు ఏఎస్పీ ధీరజ్, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు,అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలకు ఉత్సవాలకు హాజరవుతారు. ఉత్సవాల మూడు రోజులు పాడేరు పట్టణంలో సాయంత్రం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసింది.



ఉత్సవాలకు ఏర్పాటు చేసిన సతకంపట్టు

పటిష్ట బందోబస్తు

పాడేరు : మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా సుమారు 750 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. వంతాడపల్లి చెక్‌పోస్టు, నక్కలపుట్టు, సెయింటాన్స్ స్కూల్ జంక్షన్, తలార్‌సింగి, చింతలవీధి, పట్టణంలోని సుండ్రుపుట్టు జంక్షన్, అమ్మవారి గుడి, సినిమా హాల్ సెంటర్, మెయిన్ బజార్, సతకం పట్టు తదితర ప్రదేశాల్లో బందోబస్తు పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బందోబస్తు సిబ్బందితో పాడేరు ఏఎస్పీ ధీరజ్ సమావేశం నిర్వహించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించారు. ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతవరణంలో అమ్మవారిని దర్శించుకునేలా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జాతరలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు తావులేకుండా ప్రణాళికపరంగా చర్యలు తీసుకున్నామని ఏఎస్పీ ధీరజ్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పాడేరు సీఐ నవీన్‌కుమార్, ఎస్‌బీ సీఐ హిమగిరి, పాడేరు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకునేందుకు ఘటాలు సిద్ధం



విద్యుత్ దీపాల సెట్టింగులు

క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన ముస్లిం యువత

సీతంపేట(విశాఖ): ముస్లిం ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. విశాఖ ముస్లిమ్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ అల్ హజ్ రహమతుల్లాహ్ బేగ్ ముఖ్య అతిథిగా పాల్గొని జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన వారి అర్హత బట్టి పలు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. జొమాటో, కె.ఎల్.గ్రూప్, ఐఎఫ్‌బీ, అమెజాన్ తదితర 10 కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలో బొల్లినేని మెడ్ స్కిల్స్ నుంచి వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారితో పాటు 190 మంది ఉద్యోగాలు పొందారు. ప్రతినిధులు ఎం.ఎ.రజాక్, అహ్మద్ అలీ, అహ్మద్ షరీఫ్, ఎం.ఎస్. బేగ్, అస్లం, హైదరలీ సింకా పాల్గొన్నారు.

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో వ్యక్తి మృతి

మర్రిపాలెం(విశాఖ) : జ్ఞానాపురం రైల్వే స్టేషన్ గేట్ నంబర్ 4 సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. సచివాలయ సిబ్బందికి సమాచారమందించారు. సచివాలయ ఇన్‌చార్జి పోలీసులకు తెలియజేయగా వారొచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సెల్‌ఫోన్‌లో ఒక నంబర్‌కు ఫోన్ చేయగా విజయనగరానికి చెందిన లంకాడ నరేష్‌గా గుర్తించారు. మూడు రోజుల క్రితం ఓ పెళ్లికని వచ్చాడని పోలీసులు తెలిపారు. రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు జారిపడ్డాడ, లేదా మరే ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు. సచివాలయ ఇంచార్జ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య

పెదగంట్యాడ(విశాఖ): మండలంలోని వియ్యపువానిపాలేనికి చెందిన విద్యార్థి పురుగు మందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యూపోర్టు పోలీసులు వివరాల ప్రకారం.. జంగు వెంకటేష్ (22) తన తల్లితో కలిసి వియ్యపువానిపాలెంలో ఉంటున్నాడు. అతని తండ్రి గురన్న పాడేరులోని ఓ హాస్టల్‌లో పనిచేస్తుంటాడు. వెంకటేష్ ప్రస్తుతం నగరంలోని ఏవీఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అతడు కొంతకాలంగా కేజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్స పొందుతున్నాడు. ఇంతలో ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉద్యోగాల కల్పనకు ముందడుగు

- ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రత్యేక పోర్టల్
- ఒక క్లిక్ దూరంలో ఉద్యోగ అవకాశం
- ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తో సులువుగా ఉద్యోగ సమాచారం
- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం
- మోడల్ కెరీర్ సెంటర్లుగా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు



ఉద్యోగాలు పొందిన యువతతో ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థల ప్రతినిధులు (ఫైల్)



విశాఖ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం

కంచరపాలెం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఉపాధి కార్యాలయాల స్వరూపాన్ని సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి మార్చివేశారు. గతంలో అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు రోజుల తరబడి తిరిగి క్యూలో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునేవారు. అయితే ఇప్పుడు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా వెసులుబాటు వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. దీనిని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. https:// employment. ap. gov. in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ సదరు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా పొందవచ్చు. ఎంప్లాయిమెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డ్ రెన్యూవల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుంది.

సులువుగా ఉద్యోగ సమాచారం

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ సమగ్ర సమాచారం, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాల ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీల వివరాలు యువత ఫోన్ నంబర్లు, ఈ మెయిల్‌కు అలెర్ట్ మెసేజ్‌లు వస్తాయి. వీటితో పాటు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం అందిస్తూ అటు యువతకు ఇటు జిల్లాలో పలు సంస్థలకు వారధిగా ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది నిలుస్తున్నారు.

జిల్లాలో చురుగ్గా రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కంచరపాలెంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. దీంతో యువత పెద్ద ఎత్తున తమ విద్యార్హతలను నమోదు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రైవేట్ సంస్థల్లోని ఉద్యోగావకాశాల వివరాలను పోర్టల్ ద్వారా పొందుతూ, ఎప్పటికప్పుడు తమ వివరాలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చుసుకోవాలంటే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు నంబర్ తప్పనిసరి అనే నిబంధన ఉండేది. ప్రస్తుతం అటువంటి నిబంధనలకు చరమగీతం పాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఐదేళ్లలో అనేక సంస్కరణలు జరిగాయి.



జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్న అధికారులు

విశాఖ జిల్లా ఉపాధి (నేషనల్ కెరీర్ సెంటర్) కార్యాలయంలో 2024 మార్చి 31 నాటికి నమోదు చేసుకున్న అభ్యర్థుల వివరాలు

విద్యాస్థాయి వివరాలు	నమోదు చేసుకున్న అభ్యర్థులు
టెన్త్	5,445
ఇంటర్మీడియట్	7,353
డిగ్రీ	9,275
స్టెనోగ్రాఫర్స్	318
టైపిస్టులు	2,807
జీఈడీ టీచర్లు	1,024
సెకండరీ గ్రేడ్ టీచర్లు	449
డిప్లమో	3,586
ఐటీఐ	6,947
ఇంజనీరింగ్	1,7629
వైద్యులు	2,120
ఇతరులు	12,023

యువత అవకాశాలను వినియోగించుకోవాలి



యువత కోసం పెద్ద ఎత్తున జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. టెన్త్ నుంచి ఉన్నత విద్య అభ్యసించిన వారు ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు యువత కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల సమాచారం పొందవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన ఫోన్ నంబర్ యూజర్ ఐడీగా పరిగణిస్తాం. యువత ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

–సిహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా ఉపాధి అధికారి, విశాఖ

దివ్యాంగులకు భరోసా

దిశా దివ్యంగ్ సురక్ష



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్ చిత్రంలో హర్ష సాయి

బీచ్‌రోడ్డు: ఆపదలో ఉన్న దివ్యాంగులను కాపాడడానికి దిశా దివ్యంగ్ సురక్ష ఎంతగానో ఉపయోగపడుతోందని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అన్నారు. శనివారం ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయితో కలిసి ఆయన దిశా దివ్యంగ్ సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో సమాజానికి అవసరమయ్యే మరెన్నో కార్యక్రమాలను హర్ష సాయితో కలిసి చేపడతామన్నారు. దిశా దివ్యాంగ్ సురక్ష కార్యక్రమం దేశంలో ఉన్న మూడు కోట్ల దివ్యాంగులకు చేరు అయ్యేందుకు హర్ష సాయి దోహదపడతారని ఆశిస్తున్నామన్నారు. అందుకే హర్ష సాయిని ఈ కార్యక్రమానికి అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. బ్రాండ్ అంబాసిడర్ హర్షసాయి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాన్ని విశాఖలో ఏర్పాటు చేయడం అందులో తాను భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్న దివ్యాంగులకు ఉపయోగపడే ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

జిల్లాలో హాకీ అభివృద్ధికి కృషి



వేసవి శిక్షణ శిబిరంలో బహుమతులు పొందిన క్రీడాకారులు

- రాష్ట్ర హాకీ అసోసియేషన్ ట్రెజరర్ థామస్ పీటర్
- ముగిసిన హాకీ వేసవి శిక్షణ శిబిరం

యలమంచిలి: ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర హాకీ అసోసియేషన్ ట్రెజరర్ థామస్ పీటర్ అన్నారు. యలమంచిలి పట్టణం రాజీవ్ క్రీడా మైదానంలో యలమంచిలి హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న హాకీ వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హాకీ సహాయ కార్యదర్శి రవిరాజ్‌తో కలసి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ పొంది హాకీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. నెల రోజులుగా ఇక్కడ జరుగుతున్న హాకీ వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులు తర్ఫీదు పొంది మంచి ప్రతిభను కనబరిచేలా స్థానిక అసోసియేషన్ కోచ్‌లు, సీనియర్ హాకీ క్రీడాకారులు, సంఘ సభ్యులు సహాయ సహకారాలతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా హాకీ రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. వేసవి శిక్షణ ద్వారా క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీస్తున్నామన్నారు. కోచ్‌ల సూచనలు, సలహాలతో హాకీ క్రీడలో మరింత సత్తా చాటి, రాబోయే స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపడానికి సన్నద్ధం చేస్తామన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన హాకీ పోటీల్లో బాల బాలికలకు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొఠారు నరేష్, ట్రెజరర్ నరసింగరావు, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి వేగి కృష్ణ, వేణి, యమున, సుభాషిణీ, ఏబీఎల్ రాజు, కే విశ్వనాథ్, జిల్లా కోచ్‌లు రమేష్, నాగమణి, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



చేతిపై ఉన్న పచ్చబొట్టు



అల్లిపురం: నోవాటెల్ ఎదురుగాఉన్న బీచ్‌కు శనివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం కొట్టుకువచ్చిందని మహారాణిపేట పోలీసులు తెలిపారు. ఆ యువకుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. నలుపు రంగు టీషర్టు వేసుకుని ధరించి ఉన్నాడు. ఛామనచాయ రంగులో ఉన్న అతని కుడిచేతిపై ఇంగ్లిష్‌లో జై శ్రీ శ్యామ్ అని పచ్చబొట్టు ఉంది. ముఖం పై మానిన గాయాలు ఉన్నాయి. మెడలో దారంతో వెండి ఆంజనేయస్వామి లాకెట్, కుడి చేతికి ఉంగరం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96010, 83310 41628, 0891-2746866కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థి దశ నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు ఫణిభూషణ్ శ్రీధర్, శంకరబాబు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాండ్రేగుల శంకర బాబు తెలిపారు. మండలంలో తుమ్మపాలలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో రాష్ట్ర సైన్స్ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బీకేవీ గోవిందరావు ఆధ్వర్యంలో గత నెలలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ జీకేపై ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు శనివారం ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆన్‌లైన్ పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా 232 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో కిడ్స్, జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి ప్రథమ, ద్వితీయ బహుమతులుగా అందజేశామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఆడారి గోవిందరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీతలు కె.నర్సింహరావు, కె.గోవిందరాజులు పాల్గొన్నారు.

12న బీవోఐ సంరుహౌతా దినోత్సవం

విశాఖ సిటీ: ఎన్‌పీఏ రుణ గ్రహీతల కోసం బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా అన్ని శాఖలు, జోన్లు, ఎఫ్‌జీఎంల వద్ద ఒన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద రుణ ఖాతాలను సెటిల్ చేయడానికి ఈ నెల 12న సంఝౌతా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. రుణ గ్రహీతల వ్యాపారం, వైద్య పరిస్థితి లేదా మరే ఇతర నిజమైన కారణాల వల్ల రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించలేని వారి కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. బ్యాంకులో చిన్న, మధ్యస్థ విలువ కలిగిన రుణ ఖాతాలను సెటిల్ చేయడానికి ప్రత్యేక ఓటీఎస్ పథకాలు అందుబాటులో ఉన్నాయి. దీని ద్వారా ఎన్‌పీఏ ఖాతాలు ఉన్న రుణగ్రహీతలు ప్రత్యేక, మంచి తగ్గింపులు అందించనున్నారు. ఈ నెల 12న నిర్వహిస్తున్న ఈ సంఝౌత రోజున ఎన్‌పీఏ లోన్ ఖాతాలు సెటిల్ చేయడం ద్వారా ఈ తగ్గింపు అవకాశాన్ని పొందాలని బ్యాంకు జోనల్ ఆఫీస్ అధికారులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆరిలోవ(విశాఖ): బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు వివరాల ప్రకారం.. మధురవాడ ప్రాంతం మారికవలసకు చెందిన పొట్నూరు కిశోర్(42) కిరాణా షాపులకు కారం పొడి, మసాలా పొడర్ పొట్లాల పంపిణీ వ్యాపారం చేస్తుంటాడు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం షాపుల నుంచి డబ్బులు వసూలు చేయడానికి హనుమంతవాక మీదుగా బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఆ సమయంలో అడవివరం నుంచి హనుమంతవాక వైపు అదే లైన్‌లో ఎదురుగా బైక్‌పై వెళ్తున్న రవితేజ.. కిశోర్ బైక్‌ను ఢీకొట్టాడు. కిందపడిపోయిన కిశోర్ తలకు తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. రవితేజకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కిశోర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పలు రైళ్ల ఆలస్యం



తాటిచెట్లపాలెం(విశాఖ): గమ్యస్థానాలకు చేరుకోవలసిన పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున అక్కడ నుంచి బయల్దేరే రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- శనివారం మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి–సికింద్రాబాద్(07224) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.20 గంటలకు బయల్దేరింది.
- శనివారం మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–తిరుపతి (20899) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.55 గంటలకు బయల్దేరింది.
- శనివారం మధ్యాహ్నం 1.05 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–ఎస్ఎంవీటీ బెంగళూరు(06586) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 6.30 గంటలు ఆలస్యంగా రాత్రి 7.30 గంటలకు బయల్దేరింది
- శనివారం మధ్యాహ్నం 2.55 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు బయల్దేరింది.
- శనివారం సాయంత్రం 5.25 గంటలకు బయల్దేరాల్సిన కన్యాకుమారి–డిబ్రూఘడ్ (22503) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా రాత్రి 7.15 గంటలకు బయల్దేరింది.

క్లుప్తంగా

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ, తన కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తానని తెలిపారు. గడిచిన ఆరు నెలలుగా తన వెంట నడిచిన వారిని తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. గెలిచినా.. ఓడినా.. తాను ప్రజల మనిషినని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు.

'రాకేష్‌రెడ్డి, పద్మశ్రీలను తొలగించాలి'

అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీకి అన్యాయం చేస్తున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి పోచారం రాకేష్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీలను పార్టీ నుంచి తొలగించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జి.వెంకటరావు, కూండ్రపు అప్పారావు, మలపరెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, జి.శ్రీనివాసరావు, పీఎస్ దత్తు, పడాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'బకాయి పడ్డ జీతాలు చెల్లించాలి'

అనకాపల్లి : జిల్లాలోని వివిధ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని రాష్ట్ర పంచాయతీ, స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, అయినా ఆరు మాసాలుగా వారికి జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని లేని పక్షంలో ఉద్యమం తప్పదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పల్లెల రామోజీ (ఫైల్)

అనకాపల్లి : మండలంలో కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల రామోజీ (48) క్వారీలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో శనివారం తలకు తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న కూలీలు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావుకు మృతుడు భార్య పల్లెల నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 180 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,770	5,130
రెండో రకం	4,060	4,390
మూడోరకం	3,550	4,080

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
వెపన్	:శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

'భవిత'కు భరోసా

- దివ్యాంగ బాలలను తీర్చిదిద్దుతున్న భవిత కేంద్రాలు
- ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్న ఉపాధ్యాయులు
- ఈ ఏడాది కొత్తగా 37 మంది చిన్నారుల చేరిక

మట్టిలో దొరికే మణిక్యాన్ని అయినా సానబడితేనే మెరిసి కాంతులీనుతుంది. ఇదే ఆలోచనతో ప్రభుత్వం దివ్యాంగ బాలలు చదువు.. ఆటపాటల్లో సాధారణ విద్యార్థుల్లా ప్రతిభ చూపేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. చిత్తశుద్ధితో దివ్యాంగ బాలలను సాధారణ బాలల్లా మలిచేందుకు కృషి చేస్తోంది. ఆ కృషి ఫలించి నేడు ఎంతో మంది దివ్యాంగ బాలలు చదువులోను.. ఆటపాటల్లోను చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు.


దివ్యాంగ బాలుడిని భవిత కేంద్రంలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న విద్యా శాఖ అధికారులు


భవిత కేంద్రంలో విద్య నేర్చుకుంటున్న దివ్యాంగ చిన్నారులు


భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులతో తల్లిదండ్రులు

అనకాపల్లి : దివ్యాంగ బాలలు కూడా ఇతర పిల్లల్లాగే చదువుకునేందుకు ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రత్యేక భవనంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి బడిఈడు దివ్యాంగ బాలలకు ప్రత్యేక బోధన చేస్తు, వారు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అనకాపల్లి మండలంలోని కేఎస్ఆర్‌పేట ఎలిమెంటరీ స్కూల్లో దివ్యాంగ బాలల కోసం భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో గత ఏడాది 225 మంది దివ్యాంగ బాలలు ఉండగా ఈ ఏడాది మరో 37 మంది పిల్లలను కొత్తగా గుర్తించి ప్రత్యేక శిక్షణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- భవిత కేంద్రంలో 3 నుంచి 18 సంవత్సరాల లోపు దివ్యాంగ బాలలకు విద్యను అందిస్తారు.
- దివ్యాంగ బాలలను మైల్డ్, మోడ్రేట్, సివియర్, ప్రొఫౌండ్‌గా విభజించి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందిస్తున్నారు.
- మైల్డ్, మోడ్రేట్ దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రాలకు తీసుకొచ్చి, అక్కడ విద్యా బోధన చేస్తున్నారు.
- సివియర్, ప్రొఫౌండ్ దివ్యాంగ విద్యార్థులను వారి ఇళ్లలోనే ఉంచి ప్రతి శనివారం భవిత కేంద్రంలోని ఉపాధ్యాయులు దివ్యాంగుల ఇంటికెళ్లి విద్యనందిస్తారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఐదుగురు పిల్లలకు బోధన చేస్తారు.
- ఫిజియోథెరపీకి సంబంధించి మంచి ఫలితాలు వస్తున్నాయి. భవిత కేంద్రాల్లో విద్యార్థులకు పాఠశాల విద్యతో పాటు శారీరక అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి ఫిజియోథెరపీ చేయిండం వల్ల కొంత మంది విద్యార్థులు 80 శాతం మేర సాధారణ పిల్లల మాదిరిగా మారి వారి పనులు వారు చేసుకోగలుగుతున్నారు.
- భవిత కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్న దివ్యాంగ విద్యార్థులను ప్రతి రోజు కేంద్రాలకు తీసుకొచ్చే వారికి రవాణా నిమిత్తం ప్రతి నెల ప్రభుత్వం రూ.300 అందజేస్తుంది.
- దివ్యాంగ బాలికా విద్యార్థికి ప్రతి నెల అదనంగా రూ.200 స్టయ్‌ఫండ్ ప్రభుత్వం అందజేస్తుంది.
- ప్రతి సంవత్సరం భవిత కేంద్రంలో ప్రభుత్వమే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి దివ్యాంగులకు కావలసిన వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రం, బ్రెయిలీ కిట్స్, ఎంఆర్ కిట్స్ పంపిణీ చేస్తోంది.
- భవిత కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వమే సదరన్ క్యాంపులు నిర్వహించి బస్‌పాస్‌లు, రైల్వే పాస్‌లపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది
- కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందజేయడం వలన వారిలో జ్ఞాపకశక్తి పెరిగి ఉన్నత చదువులకు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు.
- అంగవైకల్యంతో జన్మించిన పిల్లలను తల్లిదండ్రులు భయపడకుండా భవిత కేంద్రాల్లో చేర్పించడం వలన పిల్లల్లో నైపుణ్యం వెలికి వస్తుంది.


భవిత కేంద్రంలో విద్యార్థికి కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)


దివ్యాంగ విద్యార్థి జోసెఫ్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి (ఫైల్)

భవిత కేంద్రంలో చక్కటి విద్యను అందిస్తున్నారు..

మా కుమారుడు జయ సూర్యచంద్ పుట్టుకతో మూగ, చెవిటి. తనతో చాలా ఇబ్బంది పడ్డాం. పిల్లవాడి భవిష్యత్ ఎలా ఉంటుందో అని ఆందోళనకు లోనయ్యాం. భవిత కేంద్రంలో చేర్పించమని మా గ్రామంలో ఉపాధ్యాయులు చెప్పారు. తుమ్మపాల హైస్కూల్లో పేరు నమోదు చేసి, భవిత కేంద్రంలో విద్యకు పంపిస్తున్నాం. ఆరో తరగతి పూర్తి చేసుకుని ఈ ఏడాది 7వ తరగతిలోకి వస్తున్నాడు. ప్రతి రోజు తుమ్మపాల నుంచి భవిత కేంద్రానికి ఆటోలో పంపుతున్నాం. కొన్నాళ్లు గడిచాక అందరు పిల్లల మాదిరిగానే చదువుకుని ఇంటికి వస్తున్నాడు.

– శ్రీనివాస్, అనకాపల్లి మండలం, తుమ్మపాల గ్రామం

కలెక్టర్ చేతుల మీదుగా ట్యాబ్ తీసుకున్నా..

నాకు కళ్లు సరిగ్గా కనిపించవు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు బాగానే వినిపిస్తాయి. 6వ తరగతి చదువుతున్న సమయంలో కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చేతుల మీదుగా ట్యాబ్ తీసుకున్నాను. ఆ ట్యాబ్‌లో చదువుకుంటున్నాను. వారానికి మూడుసార్లు మా నాన్నగారి సాయంతో భవిత కేంద్రానికి వెళ్లి విద్య నేర్చుకుంటున్నాను. పాఠాలు బాగానే అర్ధమవుతున్నాయి.

– జె. జోసెఫ్

దివ్యాంగ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి..



అంగ వైకల్యంతో జన్మించిన పిల్లల పట్ల భయపడకుండా వారి తల్లిదండ్రులు దగ్గరలో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ప్రభుత్వం భవిత కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తుంది. ఈ ఏడాది 37 మంది పిల్లలు కేంద్రంలో కొత్తగా చేరారు. దివ్యాంగ పిల్లల పేర్లను ముందుగా దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించిన తర్వాత భవిత కేంద్రాలకు పంపించాలి.

– ఎస్.ఏసురత్నం, ఉపాధ్యాయురాలు, భవిత కేంద్రం

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని నూతన వస్త్రాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శంకరరావు ఆధ్వర్యంలో కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రదక్షిణ మార్గంలో షెడ్ ఏర్పాటు


ఆలయంలో నిర్మించిన ప్రదక్షిణ షెడ్

కశింకోట : స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రదక్షిణ మార్గం చుట్టూ ఎండా వానల నుంచి రక్షణ కోసం షెడ్ నిర్మించారు. భక్తులు, దాతల సహకారంతో దీనిని సమకూర్చారు. ధ్యాన వేంకటేశ్వరస్వామిని శనివారం అందంగా వజ్ర కవచం, పూల మాలలు, తులసి మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి


మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి పూజ్యమేఘన, సిబ్బంది

దేవరాపల్లి: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఇ. పూజ్యమేఘన తెలిపారు. ఈ మేరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పూజ్యమేఘన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని సాగిద్దామన్నారు. దీనికి ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిల్వ నీటిలోనే లార్వా వృద్ధి చెందుతుందన్నారు. ఇది వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటిలో ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఇళ్లలో దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వినియోగించడంతోపాటు కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహన ర్యాలీలో సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెచ్‌వీ బి. లక్ష్మి, పీహెచ్ఎన్ బి. సునీత, హెల్త్ సూపర్‌వైజర్లు పుష్పరాజ్, అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా శిథిల వంతెనలు


పెదగొలుగొండపేట, చిన గొలుగొండపేట మధ్య ఏలేరు కాలువపై శిథిలమైన వంతెన

నాతవరం: ఏలేరు కాలువపై నిర్మించిన వంతెనలు శిథిలం కావడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిన గొలుగొండపేట, పెద గొలుగొండ మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏలేరు కాలువపై వంతెన నిర్మించారు. ఇది శిథిలం కావడంతో వచ్చేపోయే ప్రయాణికులు భయపడుతున్నారు. ఇటీవల కొత్తగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురి కావడంతో మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 13 పంచాయతీల మీదుగా 25 కిలోమీటర్ల మేర పొడవున ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. కాలువ నిర్మాణ సమయంలో చాలాచోట్ల ప్రజలు రాకపోకలకు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఏలేరు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలు ప్రస్తుతం చాలాచోట్ల శిథిలమయ్యాయి. అవి ఏ సమయంలో కూలితాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. పెద గొలుగొండపేట, ఎ.శరభవరం, జిల్లేడుపూడి ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ రోడ్లపై ఏలేరు కాలువకు వంతెనలు నిర్మించారు. గునుపూడి, పి.కే. గూడెం, ఎ.పి.పురం, లింగంపేట, మన్యపురట్ల, కొండ ధర్మవరం ప్రాంతంలో రాకపోకలు సాగించేందుకు కాలువపై వంతెనలు నిర్మించారు. ఆయా వంతెనలపై పెద్ద వాహనాలు అధిక లోడుతో రాకపోకలు సాగించడంతో కుంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వసతులుంటేనే కాన్వెంట్లకు అనుమతి

- ఎంఈవో-1 జానుప్రసాద్


బుచ్చింపేట కాన్వెంట్‌ను సందర్శిస్తున్న సర్వే బృందం

రోలుగుంట: అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన కాన్వెంట్‌లకే నిర్వహణ అనుమతి ఉంటుందని, సర్వే చేసి వాటి నివేదికలు అందజేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండలంలో కాన్వెంట్లపై మండల విద్యా శాఖ పర్యవేక్షణలో త్రీమెన్ కమిటీ శనివారం సర్వే చేపట్టింది. బుచ్చింపేట, కుసుర్లపూడి, జె.నాయుడుపాలెం, రోలుగుంటలో కాన్వెంట్లను శెట్టి మోహన్, కె.జగ్గారావు, ఎం.వెంకట్రావు బృందం సందర్శించింది. కాన్వెంట్‌లో రన్నింగు వాటర్, బెంచీలు, ఉపాధ్యాయుల స్టాఫ్ రూము, బాత్ రూములు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించింది. హెచ్ఎం జానుప్రసాద్ ఈ టీం సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నివేదికను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందుజేస్తామని వివరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కశింకోట : కశింకోటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కార్యకర్తల సమావేశం జరగనుందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం


రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు స్వయంభూ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం


ఎ.భీమవరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ప్రజలు సురక్షిత ఆరోగ్యాన్ని పొందేందుకు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఎ.భీమవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా బి.పి, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకునేందుకు ప్రజలు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీఎస్ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ప్రజలు


భారీ అన్న సమారాధన నిర్వహణ

కశింకోట : రిక్షా స్టాండ్ వద్ద వెలసిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రజలు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా హనుమజ్జయంతి రోజు నిర్వహించాల్సిన అన్న సమారాధనను ఇప్పుడు భారీగా నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొల్లి రామంజి, ఇంటి ఈశ్వరరావు, కొల్లి సూరిబాబు, బి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ వైస్ చైర్మన్‌కు సభ్యుల అభినందన

నర్సీపట్నం: ఏపీ బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కె.కృష్ణమోహన్‌ను నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నర్సీపట్నం కోర్టు సముదాయంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఆయన కలిసిన వారులో సెక్రటరీ లోకాలోవరాజు, చింతల ప్రకాష్, సుర్ల నాయుడు ఉన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం


నెహ్రూచౌక్‌లో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి : ఈనాడు పత్రికాధినేత రామోజీరావు మృతి అందరిని తీవ్ర మనోవేదనకు గురి చేసిందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు డి.వి.ఆర్. కార్యాలయంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాప సభ నిర్వహించారు. పత్రికా రంగానికి ఆయన విశేష సేవలు అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాటి చినరాజారావు, వేగి దొరబాబు, యల్లపు శ్రీనివాస్, కోట్ని ఉమ, ఆళ్ల ప్రవీణ్ కుమార్, రేబాక ఇంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నెహ్రూచౌక్‌లో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో సంతాప సభ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు కొణతాల హరనాథ్‌బాబు, సూదికొండ మాణిక్యాలరావు, రాజాన దొరబాబు, బుడిగి నూకఅప్పారావు, వలివిరెడ్డి వాసు, కనిశెట్టి సురేష్‌బాబు, శేఖరమంత్రి సాయిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తురాయి సోయగం



కె.కోటపాడు: గుల్లేపల్లి–చింతపాలెం మార్గంలో తురాయి చెట్ల పూలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా నాటిన తురాయి చెట్లు వేసవిలో చల్లని నీడతో వాహనదారులను ఆహ్లాదపరుస్తున్నాయి. ఈ చెట్లు నుంచి పూసిన ఎరుపు రంగు పూలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి.